

# పసిడిమనసులు - షర్మిల



*నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!*

## తెగని బంధం

ఏనాటికో మావూరి గాలి పీల్చాను. ఏ వూరి గాలైనా మట్టి అయినా ఒకటే అని గట్టిగా నమ్మే నేను కూడా మా వూళ్లో నిండాపూసిన తామరపూలతో నిండిన చెరువు,  అవతల అంతా విస్తరించి వున్న లేత ఆకుపచ్చ రంగులో వెల్వెట్ లా మెరిసే పొలాలని చూస్తూ గుండెలనిండుగా గాలి పీల్చుకున్నాను. చెరువు ఒడ్డున రావి చెట్టు దాని నీడన చాకలి బండలు.. ప్రస్తుతం అక్కడ నిశ్శబ్దంగా వుంది. ఒకప్పుడు బట్టలు వుతుకుతూ వాళ్లు వుష్ వుష్ అంటా చేసే సవ్వడులు వినబడేవి.

" ఎన్నాళ్లకి!? " అంటా పెద్దమ్మ చెయ్యి పట్టుకుంది.

పెద్దనాన్నను వాటేసుకున్నా!

" ఏనాడైందో నా తల్లిని చూసి. ఈ ముసలాళ్లను చూడాలని అనిపించదేమే!? " అన్నాడు.

" ఎందుకుండదూ? కాకపోతే అక్కడ సెలవు ఇవ్వద్దూ, వుద్యోగం చేయనన్నాళ్లూ ఏమీ చెయటల్లేదని గోల చేసింది నువ్వేగా " అన్నాను కోపంగా.

" సర్లే రండి.. అబ్బాకూతుళ్లు మాట్టాడుకుంది చాలుగాని , అన్నాలు తిందురు గాని" అని పెద్దమ్మ పిలవడంతో అన్నం పళ్లాల దగ్గర కూర్చున్నాం. సుష్టుగా తిని ఆరుబయట మంచం మీద నిర్మలంగా చుక్కలతో మిలమిలలాడే ఆకాశాన్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాను. మర్నాడు నేనో పెళ్లికి వెళ్లాలి, అందుకే రెండురోజులు సెలవు పెట్టి వూరొచ్చాను.

మర్నాడే పెళ్లి . పెళ్లి తంతు అయ్యాక భోజనాలకు ఇంకా సమయం వుండటంతో అంతా కబుర్లలో పడ్డారు. నేను కూర్చున్న కుర్చీ పక్కన వచ్చి నిలబడింది సీత .

సీత మా రాగోలు చెల్లి. రాగోలు మా ఇంటి చాకలి. అయితే రాగోలు ఏనాడు రేవులో దిగి  బట్టలు వుతకడం చూడలేదు. తనకున్న పొలం చెక్కలో పని చేసుకోవడంతో పాటు మా తాతకి పొలం పనుల్లో సాయం చేసేవాడు. ఈరాం మాత్రం ఇద్దరు రైతుల ఇళ్లలో బట్టలు వుతికేది. బట్టల మూటలు తీసుకుని రేవులో వుతికి సాయంత్రానికి మడతలేసి ఆ పొతిక ఇచ్చి వెళ్లేది. రాగోలు పిల్లలు నాకన్నా చాలా పెద్దాళ్లు. కానీ ఆఖరికూతురు అమ్మాజీ నేనూ ఒక జట్టుగా ఆడుకునే వాళ్లం. నాకు మూడేళ్లప్పుడు ఒకసారి మా ఇంటి ఎదురుగానే వుండే చెరువులో మునిగిపోతే పైకి తేలుతున్న నా తల రిబ్బన్ చూసి రాగోలు పెద్దకొడుకు సాంబడు చెరువులో దూకి  నన్ను బయటకు తీశాడంట. రాగోలు పెద్దకూతురు శేషాం నన్ను ఎత్తుకు మోసేది. నేను కూడా " బట్టలేయ్యండి చిట్టెమ్మారూ ! అని నాయనమ్మని అచ్చం ఈరాం అడిగినట్టే అడిగి మూట భుజాన వేసుకుని బట్టలుతికే ఆట ఆడేదాన్ని.

నా పెళ్లి తరవాత అప్పగింతల్లో రాగోలు " బిడ్డని అస్తారబతంగా పెంచుకున్నామయ్యా, మీ చేతుల్లో మా ప్రాణాన్ని పెడుతున్నాం " అని కంటతడి పెట్టాడు.

పాత జ్ఞాపకాలు మనసులో ముసిరాయి.

తేరుకుని "సీతా బాగున్నావా? అంతా బాగున్నారా?" అనడిగాను.

" రాగోలు ఏనాడో పోయాడు, ఈరాం పిల్లలు ఇచ్చేదాంతో ఇంత వుడకేసుకు తింటాంది. దానికే ఈ చచ్చే వయసులో కష్టం వొచ్చిపడింది " అంది.

"ఏమయ్యింది?" అన్నాను.

" నీకు తెలవదా సాంబడు పోయాడుగా!" అంది.

"అదేంటి ఎట్టా?" అన్నాను.

" కేన్సరొచ్చింది. ఇక్కడ డాక్టర్లు లాబం లేదన్నారు. పోయేముందు తలనెప్పి ఆడ్ని సంపేసింది ... ఎప్పుడూ మీగురించే. నావాళ్లంతా ఇసాకపట్నంలో వుండారు. ఇంకా పెద్ద డాక్టర్లకు చూపిస్తారు. తీసికెల్లండో అని ఒకటే గోల " అని చెప్తుండగానే చెప్పలేని ఏడుపు వచ్చింది. సీతని వాటేసుకుని ఏడ్చాను. చుట్టుపక్కల వాళ్లు చిత్రంగా చూస్తున్నా పట్టించుకోలా. నా మనసు బరువు తీరాలంటే ఈరాన్ని సాంబడి పెళ్లాం పిల్లల్ని పలకరించాలి.

వెంటనే సీతని ఎమ్మట పెట్టుకుని ఈరాం దగ్గరికి ఎళ్లాను.

ఈరాం గగ్గోలు గగ్గోలుగా ఏడ్చింది.

" ఈరాం ! కనీసం మాకు ఓ వుత్తరమన్నా రాయించలేదేం " అన్నా.

" ఏం చేయను తల్లా! ఆడు బతకడని మాకు తెలుసు, ఆడే చిన్నపిల్లలు తను లేకుండా ఎట్టా బతుకుతారో కొన్నాళ్లు బతకాలన్న ఆశతో మీ దగ్గరికి తీసికెల్తే పెద్ద డాక్టర్లకి చూపిస్తారనే ఏడిసాడమ్మో! " అని గోల పెట్టింది , ఈరాన్ని ఓదార్చి ఇంటికి చేరాను.

ఇంట్లో పెద్దమ్మ " అదేంటే ! పెళ్లిపందిట్లో ఆ సీతని పట్టుకుని శోకాలు పెట్టావంట, భోజనం కూడా చేయకుండా ఈరాం ఇంటికి పోయావంట" అంది.

"పెద్దమ్మా ! సాంబడి కోసం ఏడవక పోతే ఎవరి కోసం ఏడుస్తాను? సాంబడు నా బంధువు కాబట్టి ఏడుపు వచ్చింది" అన్నాను.

పెద్దమ్మ అర్థం కానట్టు చూసింది.

" రక్త బంధువులే కాదు ఆత్మబంధువులు కూడా వుంటారు. వాళ్లతో వుండే బాంధవ్యం పైకి కనబడదు కానీ అది మనం వున్నన్నాళ్లూ తెగని బంధం".. మనసులోనే అనుకున్నానో, పెద్దమ్మతో అన్నానో గుర్తులేదు..!

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

COMMENTS